సదస్సులో పాల్గొన్న పలు యూనివర్శిటీలకు చెందిన పరిశోధకులు

ఐఐటీహెచ్‌లో జెండర్ డైనమిక్స్‌పై సదస్సు

కంది, ఫిబ్రవరి 11:సంగారెడ్డి జిల్లా కంది లోని ఐఐటీ హైదరాబాద్‌లో మంగళవారం నగదు బదిలీ పథకాలు, జెండర్ డైనమిక్స్‌పై జాతీయ సదస్సు జరిగింది. వికసిత భారత్ ప్రాజెక్ట్‌లో భాగంగా బేటీబచావో..బేటీ పడావో, బాల్యవివాహాలు, లింగ సమానత్వం తదితర అంశాలపై సదస్సు నిర్వహించారు. ఐఐటీ హైదరాబాద్, ఢిల్లీ, గౌహతి ఐఐటీల తోపాటు పశ్చిమ బెంగాల్ యూనివర్శిటీ పరిశోధకులు పాల్గొని లింగ వివిధాలపై ప్రభావంపై చర్చలు జరిపారు. బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, బాలికల సామాజిక-ఆర్థిక భవిష్యత్తుపై ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో విద్యా పరిజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో అర్థవంతమైన మార్పును తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. లింగ సమానత్వం, సామాజిక పరివర్తనను ఎలా ప్రోత్సహిస్తాయో పరిశీలించేందుకు ఈ సదస్సు కీలకమన్నారు. ఈ మిషన్‌కు మరింత మద్దతు నిచ్చేందుకు ఉన్నత విద్యలో విద్యార్థినులను ప్రోత్సహించేందుకు సూపర్‌న్యూమరీ సీట్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ అనిందితాముజుందార్ మాట్లాడుతూ సమగ్ర, సమర్థవంతమైన లింగ విధానాలకు దోహదపడే సమాచార చర్చలను ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. సదస్సులో పలు యూనివర్శిటీలకు చెందిన పరిశోధకులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియమావళికి లోబడి విధులు నిర్వర్తించాలి

ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 11: ఎన్నికల నిర్వహణ నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో స్టేజ్-1, స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల నిర్వహణలో ఎంత అనుభవం ఉన్నా శిక్షణ చాలా అవసరమని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి వివాదాలు, తప్పిదాలు లేకుండా నిబంధనల మేరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాల కోసం నామినేషన్లు స్వీకరించే రోజు నుంచి నామినేషన్ల ఉపసంహరణ వరకు మార్గదర్శకాలకనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాల కోసం పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత ఖాతా ద్వారానే అన్ని లావాదేవీలు జరపాలన్నారు. ఈసీ నిర్దేశించిన నామినేషన్ల కోసం వచ్చే అభ్యర్థులకు ఈ విషయాన్ని తెలుపాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తరువాత బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తులతో పాటు నోటా సింబల్‌ను కూడా విధిగా చేర్చాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఎలాంటి ఆక్షేపణలు లేకుండా పూర్తి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలని ఎన్నికల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీపీవో సాయిబాబా, జెడ్పీసీఈవో జానకిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ఏపీడీ బాలరాజు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన అధికారులు

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, చిత్రంలో అదనపు కలెక్టర్ చద్రశేఖర్ తదితరులు

కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలి

మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 11: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో ఉన్న టీఎస్ మోడల్‌స్కూల్, కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఇంటర్ విద్యార్థులతో మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో సౌకర్యాలు, బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతుందని, కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకొని మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పది, ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మోడల్ స్కూల్స్‌ను సందర్శించి, విద్యార్థులపై టీచర్లు, అధ్యాపకులు తీసుకుంటున్న ప్రత్యేక కార్యాచరణను పరిశీలిస్తున్నామని చెప్పారు. విద్యార్థులందరూ మంచి ఉత్తీర్ణతను సాధించేలా మోటివేషన్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికబద్ధంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మోడల్ స్కూల్‌లో బ్యూటీ అండ్ వెల్‌నెస్ శిక్షణ తరగతిని ప్రారంభించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి మంజరి, ప్రిన్సిపాల్ పద్మలత, వైస్ ప్రిన్సిపాల్ అరవిందర్‌గోష్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి

ప్రజలను నమ్మించి నయవంచన చేస్తున్న కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 11:ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ నాయకులు అలవికాని హామీలిచ్చి ప్రజలు నమ్మించి నయవంచన చేశారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్హేర్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కల్హేర్ నుంచి నల్లవాగు, పిట్లం, రాపర్తి వరకు రోడ్డు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి మంజూరైన పనులు చేపట్టడంలో కాంగ్రెసోళ్లు విఫలమవుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లపై కమిషన్ల కోసం ఒత్తిడి చేయడంతో నిర్మాణం పనులు చేపట్టేందుకు ముందుకురావడం లేదన్నారు. నల్లవాగులో ప్రస్తుతం ఉన్న నీటి సామర్థ్యం కంటే తక్కువ ఉన్నప్పుడు వానకాలం యాసంగి పంటలకు చివరి ఆయకట్టు వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం నీరు అందించిందన్నారు. భూగర్భజలాలు పెంపొందడంతోపాటు పొలాలకు నీటి సరఫరా కోసం నల్లవాగులో చెక్‌డ్యాంలు నిర్మించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతుబంధుకు రాందారం చెబుతుందని కేసీఆర్ ప్రజలకు చెప్పితే, మేం అంత దివాలాగాళ్లమా అని రేవంత్‌రెడ్డి చెప్పరని, మరి ఇప్పుడేమనాలో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో భూస్వాములకు రేషన్‌కార్డులు పంపిణీ చేశారని గ్రామసభల్లో కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో కాంగ్రెసోళ్లు భూస్వాములకు రేషన్‌కార్డులు పంపిణీ చేయలేదా అని ప్రశ్నించారు.

కల్హేర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో రైతులకు కరువైన మద్దతు

సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఫైర్

అందోల్, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ పాలనలో రైతుల బతుకులు అగమ్యగోచరంగా మారాయని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. పండించిన పంటలు అమ్ముకోడానికి కేంద్రాలు లేక, బయట అమ్ముకుంటే కనీస మద్దతు ధర లభించక రైతన్నలు అప్పులపాలవుతున్నారని మండిపడ్డారు. మంగళవారం అందోల్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మార్కెట్లో పత్తికి మద్దతుధర లేకపోవడంతోపాటు కందులు, శనగల కొనుగోళ్లే ఊసే లేదన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోడానికి కూడా రైతులు కష్టపడాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు. వట్‌పల్లి మండలానికి చెందిన ఓ రైతు ఎండు మిర్చి అమ్ముకోడానికి ఇక్కడ సరైన మార్కెట్ లేక అష్ట కష్టాలు పడి వరంగల్‌కు తీసుకు వెళ్తే అక్కడ దళారులు క్వింటాలుకు కేవలం రూ.9వేలు చెల్లించారని, దారి ఖర్చులు, కూలీలు ఇతరత్రా పెట్టుబడికే సరిపోయిందని ఆ రైతు వివరించాడన్నారు. మార్కెట్లో ఎండుమిర్చికి మద్దతు ధర రూ.13వేలు ఉండగా రైతులకు మాత్రం అది దక్కడం లేదని, రైతన్నలు అడుగడుగునా నిలువుదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కనీస అవగాహన లేకుండా పాలన సాగిస్తున్నదని దీంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతురుణమాఫీ లేదు, రైతుభరోసా లేదు, ఎన్నికల్లో ఇస్తామని చెప్పిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా మాటలతో రోజులు దాటవేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకునిరైతు భరోసాను అరకొరగా వేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎన్ని ఎత్తులు వేసినా ప్రజలు వారి ఎత్తులను చిత్తు చేస్తారన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి శ్రేణులకు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్లు నారాయణ, నాగభూషణం, అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు వెంకటేశం, లింగాగౌడ్, మాణిక్‌రెడ్డి, వర్మ, సంతోశ్, శంకర్, మహేశ్‌యాదవ్, సాయికుమార్, గోపాల్, షకీల్ పాల్గొన్నారు.

అందోల్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

విద్యార్థినికి ఆర్థిక సాయం

పటాన్‌చెరు, ఫిబ్రవరి 11: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినికి సింహవాహిని ఫౌండేషన్ ఆర్థికసాయం అందజేసింది. మంగళవారం పటాన్‌చెరులోని ఎండీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో విద్యార్థినికి సింహవాహిని ఫౌండేషన వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీరెడ్డి రూ.12వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్న యోగ్యత కలిగిన విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మధు పాల్గొన్నారు.

దూర విద్యలో ప్రవేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 11: ప్రొఫెసర్ రాంరెడ్డి దూర విద్యకు సంబంధించి రెండో విడత ప్రవేశాలు ప్రారంభమయ్యాయని స్థానిక తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 31లోగా ప్రవేశాలకు గడువు ఉన్నదని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.osmania.ac.in/oucde.net వైబ్‌సైట్‌లో గానీ 040 27097177 నెంబర్లపై సంప్రదించవచ్చన్నారు.

లెక్చరర్‌కు అభినందన

సిర్గాపూర్, ఫిబ్రవరి 11: సిర్గాపూర్‌లోని ఎస్టీ బాలికల గురుకుల కళాశాల లెక్చరర్ మధుర చౌహాన్ వ్యక్తిత్వ వికాసంలో సత్తా చాటారు. ఆమెకు బెస్ట్ ఇంపాక్ట్ ట్రైనర్ ప్రశంసాపత్రం, అవార్డు దక్కింది. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ అధినేత గంపా నాగేశ్వర్‌రావు నేతృత్వంలోని ప్రతిష్టాత్మకమైన ఇంపాక్ట్ ప్రోగ్రాంలో పబ్లిక్ స్పీకింగ్, స్కిల్స్, లైఫ్, టెక్నికల్, పర్సనల్ డెవలప్‌మెంట్ స్కిల్స్ తదితర వాటిపై నైపుణ్యత శిక్షణ కల్పించారు.అందులో మధుర ప్రతిభను కనబర్చి అభినందనలు పొందింది.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్

చౌటకూర్, ఫిబ్రవరి 11: మండలంలోని బొమ్మారెడ్డిగూడెం బాలుర గిరిజన పాఠశాలకు ఆర్వో ప్లాంట్ మంజూరైంది. అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు, తహసీల్దార్ మన్నె కిరణ్‌కుమార్ మంగళవారం పాఠశాలకు వెళ్లి ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవంటూ విద్యార్థులు పలు పర్యాయాలు ఆందోళన చేపట్టడంతో స్పందించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు, ఆర్వో ప్లాంట్ తదితర సౌకర్యాలు కల్పించేందు కు నిధులు కేటాయించారని ఆర్డీవో తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులకు అవగాహన

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 11: పటాన్‌చెరు మండలం భానూర్‌లోని బీడీఎల్‌లో సీఐఎస్ఎఫ్ యూనిట్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆయుధ కర్మాగారంలోని పీఏంకేవీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక భద్రత, విపత్తు నిర్వహణ తరలింపు డ్రిల్ నిర్వహించారు. ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భారతీదేవి, బీడీఎల్ సీఐఎస్ఎఫ్ యూనిట్, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పుల్కల్, ఫిబ్రవరి11: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం సైబర్ క్రైమ్, పోక్సో, రోడ్డు భద్రత, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

కల్హేర్, ఫిబ్రవరి 11: గ్రామీణ ప్రాంతాల ప్రజలు పోస్టాఫీసు సేవలను వినియోగించుకొని, బలోపేతానికి పొదుపు, బీమా ఖాతాలు తెరిచి సహకరించాలని తపాల శాఖ అధికారి మెయిల్ ఓవర్‌సీర్ అశోక్ కోరారు. మంగళవారం నిజాంపేట్‌లోని సబ్ ఆఫీస్‌లో బ్రాంచ్ పోస్టు మాస్టర్లతో వివిధ రకాల ఖాతాలను తెరిపించడంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు పొదుపు, బీమా పథకాలతో పాటూ ఆడపిల్లల భవిష్యత్తు కోసం కేంద్రం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతాలు తీయాలన్నారు. పోస్టాఫీసు మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్పీఎం శ్రీనివాస్‌రావు, బీపీఎంలు సంగమేశ్వర్‌రెడ్డి, సాయిలు, అఖిల జ్యోతి, సోని, ఏబీఎంలు చిరంజీవి, భరత్, సిబ్బంది జబ్బార్, శంకర్‌లు ఉన్నారు.

స్థానిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 11:స్థానిక సంస్థల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సమర్థమంతగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలన్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు ఉంటాయన్నారు. ఆర్వోలు, ఏఆర్వోలు ఎన్నికల నిర్వహణలో ముఖ్యభూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల నియమాలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకొని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. డివిజన్ పంచాయతీ అధికారి అమృత మాట్లాడుతూ..నోటిఫికేషన్ జారీ నుంచి నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందన్నారు. ఓటరు జాబితాలోని పేరును అక్షర క్రమంగా పరిగణలోకి తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు తలత్తేందుకు ఆస్కారం ఉండదన్నారు. అభ్యర్థులు ఎన్ని నెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. వాటిలో ఎన్ని ఆమోదించారు, ఎన్ని తిరస్కరించారు, అందుకు గల కారణాలు ఏమిటి.. అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ల దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు స్థానికులా..కాదా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుంచి రోజువారీగా నివేదికలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంపీడీవోలు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, మహేశ్, సుధాకర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ మనోజ్

నష్టపరిహారం అందజేత

జిన్నారం, ఫిబ్రవరి 11: కార్మికుడి కుటుంబానికి నాయకుల చొరవతో న్యాయం జరిగింది. జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని శ్రీ విలాస్ పరిశ్రమలో 20ఏండ్లుగా పనిచేస్తున్న హరినాథ్‌రెడ్డి(54) ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో కార్మికుడి కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి, సంఘ సేవకులు ఆనంద్ కృష్ణారెడ్డి అండగా నిలిచారు. వారు పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. నాయకుల విజ్ఞప్తి మేరకు పరిశ్రమ యజమాన్యం కుటుంబానికి రూ.22 లక్షలు చెక్కును అందించి ఆదుకుంది. ఆపద సమయంలో పేద కుటుంబానికి అండగా నిలిచిన నాయకులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పీర్‌గైబ్ సాహెబ్ ఉత్సవాల్లో అలరించిన కుస్తీ పోటీలు

భారీగా తరలివచ్చిన ప్రజల మధ్య కుస్తీ పడుతున్న మల్లయోధులు

జహీరాబాద్, ఫిబ్రవరి 11: ప్రస్తుతం ఎన్నో ఆధునిక క్రీడలు పుట్టుకొచ్చినప్పటికీ పల్లెలో కుస్తీ పోటీలకు ఉన్న ఆదరణ మాత్రం తగ్గడం లేదు. తెలంగాణ సంప్రదాయానికి ప్రతిబింబంగా నిలుస్తున్న కుస్తీ పోటీలంటే పల్లె ప్రజలకు ఎంతో ఇష్టం. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ శివారులోని ఉర్సే షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా దర్గా 358వ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు అలరించాయి. దర్గా సమీపంలో ఏర్పాటు చేసిన పోటీలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు భారీగా తరలివచ్చారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీసులు ఎలాంటి గోడలు జరగకుండా కుస్తీపోటీలు ఏర్పాట్లు చేశారు. డప్పు చప్పుడు, ప్రజల కరతళ ధ్వనులు, ఈలాలు, కేరింతల మధ్య మల్లయోధులు కుస్తీలను నువ్వానేనా అన్న రీతిలో పోటీపడ్డారు. ఆఖరి కుస్తీలో విజేతగా నిలిచిన మల్లయోధుడు మహారాష్ట్రలోని లాతూర్ చెందిన శ్రీకృష్ణజాదవ్‌కు ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు, మండల నాయకులు కలిసి 11 తులాల వెండి కడియాన్ని అందజేశారు. ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో దర్గా ప్రాంతం కిక్కిరిసిపోయింది. దర్గాలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రప్ప, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, భద్రుస్వామి, ఉర్సు నిర్వాహక కమిటీ సభ్యులు యూనూస్‌ఖాన్, వాహబ్, మక్సూద్, నర్సింహులు, జగన్నాథ్, మక్సుద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



చిమ్నాపూర్ కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఫిబ్రవరి 11: చిమ్నాపూర్ కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అంతకుముందు ముదిరాజ్ సంఘ నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే అందరిని అప్యాయంగా పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ కృష్ణగౌడ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నరహరిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, మనోహర్‌గౌడ్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.



మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మల్లన్న ఆలయంలో మాజీఎమ్మెల్యే పూజలు

అందోల్, ఫిబ్రవరి 11: జోగిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు నిర్వహించిన బోనాల ఊరేగింపులో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డోలు వాయించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు నారాయణ, నాగభూషణం, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు వెంకటేశం, మహేశ్‌యాదవ్, బీర్ల శంకర్, లింగాగౌడ్, వర్మ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ అస్థి పంజరం లభ్యం

జహీరాబాద్, ఫిబ్రవరి 11: గుర్తు తెలియని మహిళ అస్థి పంజరం లభించిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ హద్నూర్-ఎల్గోయి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని హద్నూర్-ఎల్గోయి శివారు జాలవాగు సమీపంలో గుర్తు తెలియని మహిళా శవాన్ని చూసిన రైతులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్నారు. గుర్తు తెలియని మహిళ పూర్తిగా కుళ్లిపోయి అస్థిపంజరం మాత్రమే ఉందన్నారు. వయస్సు 50 వరకు ఉంటుందని, శవంపై నల్లని స్వెట్టర్, గులాబీ రంగు అకుల డిజైన్ ఉందన్నారు. పట్టు చీర పసుపు పచ్చరంగు కలిగి ఉందన్నారు. మహిళ చనిపోయి దాదాపు నాలుగు నెలలు అయి ఉంటుందని పోలీసులు తెలిపారు. మహిళను హత్య చేసి ఇక్కడికి తీసుకువచ్చి పడివేశారా..?..లేదా అత్మహత్యకు పాల్పడిందా.. ఇంకా ఏదైనా కారణంతో మహిళ మృతి చెందిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎవరైనా గుర్తు తెలియని మహిళా శవాన్ని గుర్తిస్తే హద్నూర్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. శవం పూర్తిగా కుళ్లిపోయి అస్థి పంజరం మాత్రమే మిగలడంతో జహీరాబాద్ ప్రభుత్వ దవాఖాన నుంచి వైద్యాధికారిని ఘటనా స్థలానికి రప్పించి పోస్టు మార్టం చేసి అక్కడే కననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

మునిపల్లి, ఫిబ్రవరి 11: మునిపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 2005-06 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహించారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఇసుక ఫిల్టర్లపై టాస్క్‌ఫోర్స